తెలకపల్లి రవి

# వెయ్యేళ్ళ చరిత్ర

## 1000-2000 ప్రపంచ పరిణామాలు



ప్రజాశక్తి బుక్‌హౌస్

ప్రచురణ సంఖ్య : 823
ప్రచురణ కాలం : అక్టోబరు, 2004
ద్వితీయ ముద్రణ : మార్చి, 2006

వెల : రు.60/-

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి
హైదరాబాద్-20. ఫోన్ : 27660013

బ్రాంచీలు
హైదరాబాద్, విజయవాడ,
విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,
హన్మకొండ, నల్గొండ, గుంటూరు

ముద్రణ
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

# వెయ్యేళ్ళ చరిత్ర

**1000-2000 ప్రపంచ పరిణామాలు**

**తెలకపల్లి రవి**

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

***హైదరాబాద్-20. ఫోన్ : 27660013***

# విషయసూచిక


| | |
|---|---|
| చారిత్రక విభాతం | ............... 1 |
| మధ్యయుగాల తొలి మజిలీ | ............... 6 |
| ఫ్యూడల్ పదఘట్టనలు-పట్టణాల తొలిఘట్టాలు | ............. 11 |
| మతయుద్ధాల మహోజ్వాలలు | ............. 16 |
| విస్తరించిన పట్టణాలు-బలపడ్డరాజు | ............. 20 |
| తిరగబడ్డ రైతాంగం | ............. 25 |
| బలహీనపడ్డ ఢిల్లీపీఠం | ............. 30 |
| సాహసయాత్రలు-అన్వేషణలు | ............. 35 |
| పెట్టుబడిదారీ వ్యవస్థ బీజాలు | ............. 39 |
| సాంస్కృతిక వికాసం-చర్చిపై తిరుగుబాటు | ............. 44 |
| ఇంగ్లీషు విప్లవం | ............. 49 |
| మరాఠాల ప్రాభవం-ఆంగ్లేయుల ప్రవేశం | ............. 54 |
| అమెరికా స్వాతంత్ర్య పోరాటం | ............. 59 |
| ఫ్రెంచి విప్లవ ప్రతిధ్వనులు | ............. 64 |
| నెపోలియన్ శకం | ............. 69 |
| బ్రిటిష్ వలసగా భారతదేశం | ............. 75 |
| సామ్రాట్టుల కుట్రలు-సామాన్యుల విప్లవాలు | ............. 80 |
| శ్రామికోద్యమాలు-శాస్త్రీయ కమ్యూనిజం | ............. 86 |
| విఫల విప్లవాలు-విస్తరించిన వలసలు | ............. 91 |
| భారతీయుల తిరుగుబాటు | ............. 96 |
| కార్మికచైతన్యం-పారిస్ కమ్యూన్ | ............ 101 |
| సామ్రాజ్యవాదం యుద్ధ సన్నాహాలు | ............ 107 |
| మొదటి ప్రపంచ యుద్ధం-రష్యా సోషలిస్టు విప్లవం | ............ 113 |
| ఫాసిజం పెరుగుదల - సామ్రాజ్యవాద వత్తాసు | ............ 119 |
| ఫాసిస్టు జర్మనీ పీచమణచిన సోవియట్ | ............ 124 |
| సర్వత్రా స్వతంత్ర పవనాలు | ............ 130 |
| భారత స్వాతంత్రోదయం | ............ 136 |
| చైనాపై అరుణతార | ............ 141 |
| సోషలిజానికి ఎదురుదెబ్బ | ............ 147 |
| చరిత్రా.... ముందుకు పద! | ............ 153 |
| సహస్రాబ్ది ముఖ్యఘటనలు | ............ 157 |

# చారిత్రక విభాతం



- ఆదిమ సమాజం.
- బానిస వ్యవస్థ.
- వ్యవసాయం, చేతివృత్తులు.
- మౌర్యసామ్రాజ్యం.
- రోమ్ పతనం - బానిస వ్యవస్థ సమాప్తి.

*అజ్ఞానపు టంధయుగంలో,*
*ఆకలిలో, ఆవేశంలో*
*తెలియని ఏ తీవ్రశక్తులో*
*నడిపిస్తే నడిచి మనుష్యులు*

*అంతా తమ ప్రయోజకత్వం,*
*తామే భువి కధినాథులమని,*
*స్థాపించిన సామ్రాజ్యాలూ,*
*నిర్మించిన కృత్రిమ చట్టాల్*

*ఇతరేతర శక్తులు లేస్తే*
*పడిపోయెను పేక మేడలై;*
*పరస్పరం సంఘర్షించిన*
*శక్తులలో చరిత్ర పుట్టెను.*

ప్రతి దేశానికి చరిత్ర ఉంటుంది. అవన్నీ కలిస్తే ప్రపంచ చరిత్ర అవుతుంది. దేశాలు ఇంత స్పష్టంగా ఏర్పడక ముందుకూడా మనిషికి చరిత్ర ఉంది. **మనిషి పుట్టి పది లక్షల ఏళ్ళయిందని ఒక అంచనా.** ఇందులో చాలా కాలం చరిత్రకు అందని దశకూడా ఉంది. ఆదిమ సమాజ దశ అది. అప్పుడు భూమి మీద నగరాలు లేవు. గ్రామాలు లేవు. పొలాలు లేవు. చరిత్ర పూర్వ మానవులు చిన్న చిన్న బృందాలుగా అడవుల్లో సంచరిస్తుండేవారు. వారి చేతుల్లో కర్రలు, రాళ్ళు తప్ప మరేమీ ఉండేవికావు. వస్త్రాలు లేవు. నివాసాలు లేవు. చరిత్ర వీటన్నింటినీ మనకు తెలియచేస్తుంది. ప్రాచీన చరిత్ర ఇందులో మొదటిది. ప్రాచీన ప్రజానీకం ఎంతో కష్టపడి పొలాలు దున్నేవారు. దారులు వేశారు. నగరాలు నిర్మించారు. అనేక ఆవిష్కరణలు చేశారు. అవన్నీ కలిస్తే అభివృద్ధి సాధ్యమైంది. ఉదాహరణకు పుస్తకాలే తీసుకోండి. చైనావారు కాగితం కనిపెట్టారు. గ్రీకులు అక్షరాలు కనిపెట్టారు. భారతీయులు 1 నుంచి 10వరకు అంకెలు కనిపెట్టారు. ఇటలీలో తొలిసారి పుస్తకాలు బైండింగు చేశారు. దాదాపు ఆరువేల ఏళ్ళక్రితం వివిధ దేశాలలో ప్రజలు అక్షరాలు నేర్చుకుని, రాయడం మొదలుపెట్టారు. ఆనాటి రాతప్రతులు కొన్ని ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఇంకా అంతకు ముందు కాలంలో రాతలేదు. అయితే వారు ఉపయోగించిన వస్తువుల అవశేషాలు దొరుకుతాయి. చరిత్ర పఠనంతో మనకు ఆనాటి రాజ్యాలు, రాజులు, శాస్త్రజ్ఞులు, కళాకారుల

గురించి, మరెన్నో అంశాల గురించి తెలుస్తుంది. అయితే అంత మాత్రంతోనే చరిత్ర పూర్తి కాదు.

**<u>నైలునదీ నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది?</u>**

అని శ్రీశ్రీ ప్రశ్నించినట్లు ఆనాటి ప్రజల జీవన స్థితిగతులు కూడా తెలుస్తాయి. లిఖిత చరిత్ర అన్ని దశల్లోనూ పేద ప్రజలపై దోపిడీ, అణచివేత ఎన్ని విధాలుగా సాగిందో వీటివల్ల అర్థమవుతుంది. అందుకు ప్రతిఘటన వున్నట్లు తెలుస్తుంది.

చరిత్రను ప్రాచీన చరిత్ర, మధ్యయుగ చరిత్ర, ఆధునిక చరిత్ర అని మూడు భాగాలుగా విభజించారు.

క్రీ.పూ. మూడవ శతాబ్దం నుంచి క్రీ.శ. అయిదవ శతాబ్దం వరకు గల కాలం ప్రాచీన చరిత్ర.

క్రీ.శ. 5వ శతాబ్దం నుంచి 17వ శతాబ్దం వరకు మధ్యయుగం.

ఆ తర్వాతి కాలం ఆధునిక చరిత్ర. అంటే రెండవ సహస్రాబ్దిలో మధ్యయుగం, ఆధునిక యుగం కూడా ఉన్నాయి. మానవ చరిత్రను అనూహ్యమైన రీతిలో ప్రభావితం చేసిన ఎన్ని అత్యద్భుత ఘటనలు, ఆవిష్కరణలు ఈ కాలంలోవే.

**ఈజిప్టు - బానిస వ్యవస్థ**

చరిత్ర పూర్వదశలో ఎక్కడైనా ప్రజలు సమిష్టిగా జీవించేవారు. ఆహారాన్వేషణ, జంతువుల వేట, చేపలవేట సాగించేవారు. క్రమంగా పశుపోషణ, వ్యవసాయం అభివృద్ధి చెందాయి. ఆగ్నేయాఫ్రికాలోని ఈజిప్టు మొదటగా వ్యవసాయం చేపట్టిన దేశాలలో ఒకటి. నైలునది వరదలవల్ల సారవంతమైన మట్టికొట్టుకురావడం అందుకు దోహదపడింది. అయితే అప్పటి వ్యవసాయం చాలా కష్టంగా ఉండేది. ఈజిప్టియన్లు రాగి పనిముట్లు చేయడం కనుగొన్నారు. అప్పటి వరకు ఉన్న రాతియుగం పోయి లోహయుగం వచ్చింది. పొలం దున్నడం కోసం వారు నాగలిని కనుగొన్నారు. ఆ విధంగా ఈజిప్టులో వ్యవసాయం, పశుపోషణ ప్రధాన వృత్తులయ్యాయి. పనిముట్లు తయారుచేసే చేతిపనివారు తయారయ్యారు. నాగలివల్ల ఒకో కుటుంబం విడివిడిగా పొలం దున్నుకోగల స్థితికి వచ్చింది. గుంపుపెద్దలు వారికి భూమిని కమతాలుగా విభజించి కేటాయించేవారు. ఆ విధంగా సమిష్టి జీవనం నుంచి ఒకో కుటుంబం విడిగా జీవించడం మొదలుపెట్టింది. ఈ పంపిణీ సందర్భంలో గుంపు పెద్దలు అదివరలో సమిష్టి కోసం కేటాయించిన మంచి మంచి పెద్ద భూఖండాలు తమ హస్తగతం చేసుకున్నారు.

**వ్యవసాయ పరికరాల వాడకంతో దిగుబడి పెరిగింది. అందరి అవసరాలకు సరిపోయి ఇంకా మిగలడం ప్రారంభించింది. ఈ పరిణామంతో ఈజిప్టు సమాజంలో మార్పు వచ్చింది. అంతకుముందు వేర్వేరు గుంపుల మధ్య పోరాటాలలో పట్టుబడిన శత్రు సైనికులను చంపేసేవారు. ఇప్పుడు వారిని చంపకుండా తమ దగ్గర ఉంచుకుని పనిచేయించుకోవడం మొదలుపెట్టారు. వారే బానిసలయ్యారు.** గుంపుపెద్దలు, నాయకుల దగ్గర బానిసలు పోగుపడ్డారు. ఈ బానిసలకు ఎలాంటి హక్కులు ఉండేవికావు. వారితో ఎలాంటి చాకిరీ అయినా

చేయించుకోవడానికీ, ఆఖరుకు చంపడానికి కూడా యజమానులకు అధికారాలు ఉండేవి. ఆ విధంగా క్రీ.పూ. 4వ సహస్రాబ్దిలో ఈజిప్టు సమాజం బానిసలు, బానిస యజమానులుగా విడిపోయింది. ఆ విధంగా బలపడిన యజమానులు చిన్న రైతుల నుంచి పొలాలు లాక్కోవడానికి కూడా ప్రయత్నాలు చేసేవారు. బానిసలు, రైతులు దీన్ని ప్రతిఘటించేవారు. బానిస యజమానులు వారిని బలప్రయోగంతో అణచివేయవలసి వచ్చేది. అందుకోసం మంచి ఆయుధాలతో వీరులను, రక్షకులను ఏర్పాటుచేసుకునేవారు. క్రమంగా గుంపు నాయకుల అధికారం పెరిగిపోయింది. వారే రాజులయ్యారు.

**ఈజిప్టులో క్రీ.పూ.4వ సహస్రాబ్దిలో తొలి రాజ్యాలు ఏర్పడ్డాయి. ఈ రాజ్యాలు బానిస యజమానులను రక్షిస్తూ, బానిసలను, రైతులను అణచి ఉంచేవి.** క్రీ.పూ. 3000లో ఈజిప్టు మహాసామ్రాజ్యం ఏర్పడింది. దాని రాజును ఫారో అన్నారు. అప్పుడే మతఛాయలు కూడా తలెత్తాయి. మతం కూడా రాజుకు, బానిస యజమానులకు సేవచేసింది. మతాధిపతులు అతిపెద్ద బానిస యజమానులయ్యారు. ఫారోలు కూడా దేవుళ్ళుగా చిత్రించబడ్డారు. ఈజిప్టులో బ్రహ్మాండమైన పిరమిడ్లు, ఆలయాల నిర్మాణం జరిగింది. విజ్ఞానశాస్త్రం, లిపి, హస్తకళలు, గణితం అభివృద్ధి చెందాయి. ఇవన్నీ మనిషి శ్రమించే క్రమంలోనే పెంపొందాయి.క్రమంగా ఈజిప్టు రాజు సైనిక బలం పెంచుకున్నాడు. క్రీ.పూ. 1500లో ఈజిప్టు పాలస్తీనా, సిరియాలను ఆక్రమించుకుంది. అయితే ఆక్రమణకు గురైన ప్రజల నుంచి, దివాలాఎత్తిన రైతులు, బానిసలనుంచి కూడా ఈజిప్టు రాజు ప్రతిఘటన ఎదుర్కొనవలసి వచ్చింది. క్రమంగా ఆ రాజ్యం బలహీనపడింది. క్రీ.పూ. 6వ శతాబ్దంలో పర్షియా ఈజిప్టును ఆక్రమించింది.

## భారతదేశం

భారతదేశంలో క్రీ.పూ. మూడవ సహస్రాబ్ది నాటికే నగరాలు పెంపొందాయి. క్రీ.పూ. రెండవ సహస్రాబ్దిలో వాయువ్యదిశ నుంచి ఆర్యులు దానిపై దాడి చేశారు.పశుపోషకులుగా ఉన్న ఆర్యులు వ్యవసాయం నేర్చుకుని, స్థానిక ప్రజల్లో కలిసిపోయారు. వేయి సంవత్సరాల క్రితం ఇండియాలో ఇనుము కనుగొన్నారు. అది వ్యవసాయం, చేతిపనులు, నౌకాయానం అభివృద్ధి చెందడానికి దోహదపడింది. ఇనుప నాగలి రాగి కన్నా చాలాబాగా పని చేసింది. ఇనుప గొడ్డలితో మహారణ్యాలు నరికి, గంగా మైదానాన్ని వ్యవసాయ భూమిగా తీర్చిదిద్దారు. భారతీయులు చెరకు, పత్తి, ధాన్యం పండించేవారు. పత్తిపంట యిక్కడ నుంచి ఇతర దేశాలకు వ్యాపించింది. భారతదేశంలో కళాసాహిత్యాలు, గణితం, విజ్ఞానశాస్త్రం బాగా అభివృద్ధిచెందాయి. 50 అక్షరాలు గల భారతీయ లిపిలో రాయడం ఈజిప్షియన్ భాషకన్నా చాలా తేలిగ్గా ఉండేది. అరబిక్ అంకెలుగా ఇప్పుడు వాడుకలో ఉన్నవి ఇండియానుంచే వచ్చాయి. చదరంగం కూడా యిక్కడే పుట్టింది. **మౌర్యులు భారతదేశంలో మొదటి మహాసామ్రాజ్యం స్థాపించారు.** తర్వాత గుప్తులు. దక్షిణ ప్రాంతంలో మరికొన్ని రాజ్యాలుండేవి. కులవ్యవస్థ ఏర్పడింది. బౌద్ధ, జైనమతాలు లోకాయుతవాదం కూడా పుట్టాయి.

## మెసపుటోమియా, గ్రీస్

ప్రాచీనరాజ్యాలలో ఇంకా మెసపుటేమియయా (ఇప్పటి ఇరాక్), చైనా, గ్రీస్ చెప్పుకోతగినవి. బాల్కన్ దీపకల్పంలోని గ్రీసు ప్రధానంగా ఏథెన్స్ చుట్టూ అభివృద్ధి చెందింది. గ్రీకులో నగరరాజ్యాలు వుండేవి. కులీనుల చేతుల్లో చితికిపోయిన రైతులు, ఇతర సామాన్యులు పోరాడి కొన్ని హక్కులు సాధించుకున్నారు. గ్రీకు భాషలో 'డెమో' అంటే సామాన్యుడు. 'డెమోక్రసీ' (ప్రజాస్వామ్యం) అనే విధానం అక్కడే తొలుతగా పెంపొందింది. ఈనాటి ఒలింపిక్ క్రీడలు ఏథెన్స్‌లోనే, క్రీ.పూ. 776లో ప్రారంభమయ్యాయి. థియేటర్, ట్రాజెడీ, కామెడీ వంటి మాటలు కూడా అక్కడివే. గ్రీసు బలహీనపడిన తర్వాత మాసిడోనియా రాజు పిలిప్ దాన్ని ఆక్రమించాడు. పిలిప్ కుమారుడైన అలెగ్జాండర్ దేశదేశాలపై దండయాత్రలు చేసి, సింధూనది తీరం వరకు వచ్చి వెనుతిరిగాడు. క్రీ.పూ. 323లో మృతి చెందాడు.

## రోమ్ సామ్రాజ్య పతనం - బానిస వ్యవస్థ సమాప్తి

క్రీ.పూ. 6వ శతాబ్దంలో రోమ్ చిన్న నగరంగా ఏర్పడింది. రోమ్‌లో "సెనెట్" (పెద్దల సమితి) వుండేది. రాజు సెనెట్ కలసి పాలించేవారు. రోమ్ క్రమంగా చుట్టుప్రక్కల ప్రాంతాలను కబళించింది. క్రీ.పూ.6వ శతాబ్ది తర్వాత నాయకులను ఎన్నుకోసాగారు. వీరినే కౌన్సిల్స్ అనేవారు. **రోమ్‌పాలనా పద్ధతికే రిపబ్లిక్ (రీ. వ్యవహారాలు పబ్లిక్ – ప్రజలు) అని పేరొచ్చింది. అయితే కులీనులకే ఓటుహక్కుండేది.** అన్ని వ్యవహారాలు వారే నిర్వహించేవారు. పలుదేశాలను ఆక్రమించి బలీయమైన బానిస రాజ్యంగా అవతరించిన రోమ్ బానిసల సరఫరా కోసం నిరంతర ఆక్రమణలు సాగిస్తూ వచ్చింది. **రోమ్‌లో బానిసల సంఖ్య, వారిపట్ల క్రౌర్యమూ చాలా తీవ్రంగా వుండేవి. బానిస అంటే "మాట్లాడే పనిముట్టు" అని వర్ణించేవారు!** రోమ్ దోపిడీ తట్టుకోలేని ఇటాలియన్ రైతులు తిరగబడ్డారు. స్పార్టకస్ నాయకత్వాన బానిసల తిరుగుబాటు కూడా జరిగింది. దీన్ని దారుణంగా అణచివేశారు.

రోమ్ చక్రవర్తుల నిరంకుశ పాలనతో అసంతృప్తి చెందిన ప్రజలు క్రీస్తు గురించి విని ఉపశమనం పొందారు. మొదట్లో క్రైస్తవ విశ్వాసాలను అణచివేయాలని చూసిన పాలకులు తర్వాత తామే దాన్ని స్వీకరించారు. ప్రజల అసంతృప్తి పోరాటరూపం తీసుకోకుండా చర్చి కొంతవరకు ఆపినా, మొత్తంగా అదృశ్యం చేయలేకపోయింది. క్రీ.శ. 295లో రోమ్ సామ్రాజ్యం తూర్పు, పశ్చిమ భాగాలుగా విభజించబడింది. తూర్పుకు కాన్‌స్టాంటి నోపుల్, పశ్చిమానికి రోమ్ రాజధానులయ్యాయి. క్రీ.శ. 410లో గోత్‌లు, బార్బేరియన్లు, అణచివేయబడిన ఇతర ప్రజలు కలసి చక్రవర్తిపై తిరగబడ్డారు. చివరకు 5వ శతాబ్దిలో జర్మన్లు రోమ్‌ను స్వాధీనపరుచుకున్నారు. **రోమ్ సామ్రాజ్య పతనంతో ప్రాచీన చరిత్ర ముగిసింది. అప్పటికే ప్రగతికి అవరోధంగా మారిన బానిస సమాజ ఘట్టం యూరప్‌లో ముగిసిపోయింది.**

# మధ్యయుగాల తొలి మజిలీ



- ✧ ఫ్యూడల్ సమాజ ప్రారంభం
- ✧ జర్మనీ దాడిలో రోమ్ పతనం.
- ✧ ఇండియాలో గుప్త సామ్రాజ్యం.
- ✧ ఐరోపాలో రాజ్యాల ఆవిర్భావం.
- ✧ అరబ్‌ల విజృంభణ.

**క్రీ.శ. 476లో** పశ్చిమరోమన్ సామ్రాజ్యం కుప్పకూలడంతో ఐరోపాలో బానిస వ్యవస్థ ముగిసింది. మధ్యయుగాల చరిత్ర ప్రారంభమై 12 శతాబ్దాలు సాగింది. అయితే బానిస వ్యవస్థ పతనంతోనే శ్రామిక ప్రజలకు విముక్తి లభించలేదు.

**మధ్యయుగాలలో ఆర్థిక, సాంస్కృతిక, వైజ్ఞానిక అభివృద్ధి మరింతగా జరిగింది. వ్యవసాయ పద్ధతులు మెరుగుపడ్డాయి.** ప్రాచీన కాలంలో తెలియని అనేక వస్తువులు తయారయ్యాయి. నౌకాయానానికి ఉపయోగపడే దిక్సూచి, టెలిస్కోప్ కనుగొన్నారు. నూతన ఖండాలు అన్వేషించేందుకు సాహస యాత్రలు జరిగాయి.

అయిదవ శతాబ్ది నుంచి 11వ శతాబ్ది వరకు గల కాలాన్ని మధ్యయుగాల్లో తొలిదశగా పరిగణించారు. ఐరోపా, ఆసియా, ఉత్తర ఆఫ్రికా దేశాలు ఎక్కువ వాటిలో ఈ కాలంలో భూస్వామ్యవ్యవస్థ ఏర్పడింది. దీన్నే 'ఫ్యూడల్' వ్యవస్థ అన్నారు. సైనిక పరమైన సేవలందించిన వారికి పాలకులచే ఆధిపత్యం అప్పగించబడిన విస్తార భూభాగాన్ని ఇంగ్లీషులో పియఫ్ లేదా ఫైఫ్ అంటారు. (జమీ, పరగణా, ఎస్టేట్ వంటిదన్నమాట). దానికి మూలమైన లాటిన్ పదం ఫ్యూడమ్. ఫ్యూడలిజం అన్న మాట దానినుంచే వచ్చింది. అయితే ఇది అన్నిదేశాల్లో ఒకేసారి, ఒకేవిధంగా రాలేదు. ఒకేవిధంగా వుండదు.

**జర్మన్లు, స్లావులు, అరబ్‌లు ఆదిమ సమిష్టి జీవితం నుంచి ఫ్యూడల్ వ్యవస్థలోకి ప్రవేశించారు.** ప్రాచీనకాలంలో వారికి వ్యక్తిగత ఆస్తిగాని, వర్గాలు గాని, రాజ్యవ్యవస్థ గాని వుండేవికావు. కాని మధ్యయుగాల మొదటి దశలో వారు వ్యవసాయంలో పశుపోషణలో మంచి నేర్పు సంపాదించారు. అందువల్ల అదనపు ఉత్పత్తి పొందే అవకాశమేర్పడింది. దాన్ని కులీనులు అనుభవించగలిగారు. సమాజంలోని సామాన్యులను కొల్లగొట్టారు. ఆవిధంగా అసమానతలు పెరిగాయి. భూమి, పనిముట్లు ఆయా కుటుంబాల వ్యక్తిగత ఆస్తి అయ్యాయి. దాంతో వర్గాలు పుట్టాయి. వర్గాలు వున్న సమాజంలో రాజ్యాంగ యంత్రం తప్పక ఏర్పడుతుంది. ఎందుకంటే పనిచేసే ప్రజలను అణచివుంచే సాధనంగా దోపిడీదారులకు రాజ్యాంగయంత్రం అవసరం.



**రోమన్ ప్రజలు మాత్రం ఆదిమ సమిష్టి సమాజం నుంచి గాక బానిస సమాజం**

**నుంచి ఫ్యూడలిజంలోకి ప్రవేశించారు.** వారిలో రెండే తరగతులు – భూస్వాములు – వారిపై ఆధారపడిన రైతులు లేదా అర్ధబానిసలు. బర్బరుల దాడులు, ప్రజల తిరుగుబాట్లు ఆ పరిణామక్రమాన్ని వేగిరపర్చాయి. తక్కువ ఉత్పాదకతతో, లాభదాయకమైందిగా లేని బానిసల శ్రమస్థానే అర్ధబానిసల వ్యవస్థ ఏర్పడింది. భూస్వాములు భూమిపై ఆధిపత్యం చలాయిస్తూ రైతులను దోచుకునేవారు. బానిస మొత్తం సమయం యజమానికోసమే పనిచేసేవాడు. కాని అర్ధబానిస రైతు కొంత సమయం తన పరికరాలతో స్వంత పనికూడా చేసుకోవచ్చు. ఆ పొలంలో పండినదానిలో కొంత అతనికే చెందుతుంది. బానిస యజమాని ఆస్తి. కాని అర్ధబానిస రైతుపై భూస్వామికి అంత సంపూర్ణమైన హక్కు వుండదు. అతన్ని పొలంతోపాటు అమ్మడానికి, కఠినంగా శిక్షించడానికి హక్కు వుంటుందిగాని చంపడానికి చట్టం హక్కు ఇవ్వదు. బానిసలతో పోలిస్తే రైతులు బాగా పనిచేయడానికి కొన్ని ప్రోత్సాహకాలు కూడా వుంటాయి. వారు సేద్య విధానాలు మెరుగుపరచి ఎక్కువ దిగుబడి సాధించడానికి ప్రయత్నించేవారు. పనిముట్లు జాగ్రత్తగా చూసుకునేవారు. అయినా వారి కమతాలు చాలా చిన్నవి. వారిపై సాగే దోపిడీ చాలా దారుణంగా వుండేది. అందువల్లనే వ్యవసాయ పద్ధతుల అభివృద్ధి చాలా మందకొడిగా జరిగేది.

క్రీ.శ. మొదటి శతాబ్దంలో రోమన్ సామ్రాజ్యంలో జర్మన్ తెగల చొరబాటు ప్రారంభమైంది. అయిదవ శతాబ్దిలో వారు పశ్చిమ రోమన్ సామ్రాజ్య మంతటా విస్తరించారు. ఆ తెగల్లో భాగమే ఫ్రాంకులు. 486లో ఫ్రాంక్‌లు క్లొవిన్ నాయకత్వంలో రోమన్ నగరమైన గౌల్‌ను మరికొన్ని ప్రాంతాలను స్వాధీనపరచుకున్నారు. చర్చి ఆయనను బలపరచింది. ఫ్రాంక్‌లు కుటుంబాల వారీగా ఇచ్చిన కమతాలను క్రమేణా వశపరుచుకున్నారు. చిన్న చిన్న సైన్యాలను ఏర్పాటు చేసుకుని రైతుల భూములను కబళించారు. ఇదెంత దుర్మార్గంగా జరిగిందో వివరించే పత్రాలు చాలా దొరికాయి.

## చర్చి విస్తరణ

**ఈ కాలంలోనే క్రైస్తవ చర్చి బ్రహ్మాండంగా విస్తరించింది. మతాధిపతులు, సన్యాసులు అవతరించారు. చర్చి ఒక పెద్ద యంత్రంగా మారింది.** పెద్ద పెద్ద జిల్లాలలో బిషప్‌లు, ఆర్చి బిషప్‌లు ఆ వ్యవహారాలు చూసేవారు. యూరప్ మొత్తం చర్చి అధిపతిని పోప్ అన్నారు. ఆయన నివాసం రోమ్. దేవుడే తమకు మేలు చేస్తాడనే నమ్మకంతో పేద ప్రజలు కూడా ఉన్నది కాస్తా చర్చికి సమర్పించుకునేవారు.

## పలు రాజ్యాల ఆవిర్భావం

క్రీ.శ. 768–814 మధ్య చార్లెంగ్మెన్ ఫ్రాంక్ రాజు అయ్యాడు. ప్రభువర్గానికి భూమి పంచి, రైతాంగాన్ని కొల్లగొట్టాడు. పెద్ద సైన్యం సమకూర్చుకుని దండయాత్రలు చేశాడు. శాక్సన్‌లపై ఎనిమిదిసార్లు దాడిచేసి గెలుపుసాధించాడు. ఇందుకు చర్చిని కూడా ఉపయోగించుకున్నాడు. 800 సంవత్సరం నాటికి చార్లెంగ్మెన్ రోమ్ చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు. చరిత్రలో తొలి ఫ్యూడల్ సామ్రాజ్యాల్లో అదొకటి. ఆదశలో పశ్చిమ యూరప్‌లోని భూమి మొత్తం భూస్వాములు స్వాధీనపరుచుకున్నారు. అడవులు, బీడు భూములు ఆఖరుకు నదులు కూడా తమ ఆస్తిగా ప్రకటించుకున్నారు. చార్లెంగ్మెన్ మరణానంతరం ఆయన రాజ్యం ముక్కలైపోయింది. ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ అనే మూడు రాజ్యాలేర్పడ్డాయి. అయితే వాటిలో కూడా అనేక అంతర్గత ఘర్షణలు కొనసాగాయి.

రాజు సైనికశక్తిని తమరక్షణ కోసం ఉపయోగించుకున్న భూస్వాములు బలపడగానే స్వంత సేనలతో ప్రత్యేక రాజులుగా ప్రవర్తించసాగారు. వేర్వేరు ఎస్టేట్లలోని ప్రజల మధ్య పరస్పర సంబంధాలు ఉండేవికావు. ఈకారణంగానే పశ్చిమయూరప్ దేశాలు చిన్నాభిన్నమైనాయి. 9-11 శతాబ్దాల మధ్య రాజు అధికారం బలహీనపడిపోయింది. మధ్య, తూర్పు యూరప్‌లలో జీవించే స్లావులు రాజ్యాలు ఏర్పరుచుకున్నారు. బల్గేరియా, కీవెన్‌రాస్, బొహీమియా, పొలిష్, హంగేరి రాజ్యాలు అలా ఉనికిలోకి వచ్చాయి.

**మధ్యయుగాల తొలిదశలో ఇతర చోట్లకు ప్రయాణించడమనేది చాలా అరుదైన విషయంగా వుండేది. ఐరోపా వెలుపల ఏమి జరిగేది ఐరోపా వాసులకు బొత్తిగా తెలియదు. విజ్ఞాన శాస్త్రం పూర్తిగా వెనుకపట్టు పట్టింది.** చర్చి చెప్పిందే వేదం. విశ్వాంతరాళానికి కేంద్రం భూమి అని చర్చి అభిప్రాయం. భూమి బల్లపరుపుగా వుందని, ఆకాశం దాన్ని గోపురంలా కప్పి వుంచుతుందని అనుకునేవారు. ప్రకృతి వైపరీత్యాలు తట్టుకోలేని స్థితిలో విపరీతమైన మూఢనమ్మకాలు పెరిగాయి. చదువుండేది కాదు.

## ఇండియా

భారతదేశంలో క్రీ.శ. 3వ శతాబ్ది చివర, 4వ శతాబ్ది ప్రారంభంలో ప్రధానంగా గుప్త రాజుల పాలన సాగింది. ఉపఖండంలో చాలా రాజ్యాలు ఏర్పడ్డాయి. కొన్ని రాచరిక వ్యవస్థలోనూ, మరికొన్ని గణరాజ్య విధానంలోనూ ఉండేవి. అలాటి స్థితిలోనే 319-20లో చంద్రగుప్తుడు సింహాసనం ఎక్కాడు. అయితే తర్వాత అతని సముద్రగుప్తుడు రాజ్యానికొచ్చి, బాగా విస్తరింప చేశాడు. **గుప్తుల కాలంలో పాలన, వ్యవసాయం, కళాసాహిత్యాలు బాగా వికసించాయి. ఉత్తరాన వైష్ణవమతం, దక్షిణాన శైవమతం వ్యాప్తి చెందాయి. గుప్తుల కాలంలో వాణిజ్యం బాగా వెనుకపట్టుపట్టింది. చాతుర్వర్ణ వ్యవస్థకు అవసరమైన మూఢనమ్మకాలు, భావాలు సృష్టించారు. సామాజిక జీవనం కూడా అందుకు దోహదపడింది. దక్షిణభారతదేశంలో పరిస్థితి కొంచెం భిన్నం.** గుప్తుల అనంతరం పాలకులలో హర్షుడు ప్రముఖుడు. చాళుక్యులు, పల్లవులు కూడా దక్షిణాదిన పాలన సాగించారు. ఆగ్నేయాసియాతో భారతీయులకు మంచి సంబంధాలు ఏర్పడ్డాయి.

క్రీ.శ. 711లో అరబ్బులు ఇండియాపై దాడి చేసి సింధు ప్రాంతంపై విజయం సాధించారు. కానీ అనేక కారణాలవల్ల అంతకంటే విస్తరించలేకపోయారు. ఈకాలంలో భారతదేశంలో శాస్త్రవిజ్ఞానం బాగా అభివృద్ధి చెందింది. గణితం, వైద్యం, ఖగోళశాస్త్రం, రసాయన లోహ విజ్ఞానం పెంపొందాయి. 750 తర్వాత భారతదేశం అనేక చిన్న రాజ్యాలుగా చీలిపోయింది. 9,10 శతాబ్దాలలో రాజపుత్రుల ప్రాధాన్యత బాగా పెరిగింది.

## అరబ్బులు - ఇస్లాం స్థాపన

మధ్య ప్రాచ్యంలో, తూర్పు ఆఫ్రికాలో కూడా ఫ్యూడల్ వ్యవస్థ నెలకొన్నది. నైరుతి ఆసియాలోని అరేబియా ద్వీపకల్పం అరబ్బుల జన్మభూమి. ఎడారి వాతావరణం. అతి తక్కువ జనాభా. ఒంటెలు, గుర్రాలు, గొర్రెలు మేపుకుని అరబ్బులు గడ్డి మైదానాలు అన్వేషిస్తూ సంచార జీవనం గడిపేవారు. మరికొందరు అరబ్బులు పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లోని ఒయాసిస్సుల్లో స్థిరపడ్డారు. బైజాంటైన్ నుంచి ఇండియా, ఆఫ్రికాలకు వెళ్ళే ప్రాచీన వాణిజ్యమార్గం ఎర్రసముద్రతీరం వెంటసాగేది. మక్కా అక్కడ

అతిపెద్ద పట్టణం. సంచార అరబ్బులు అక్కడ స్థిర నివాసులతో బాగా వ్యాపారం చేసేవారు. 7వ శతాబ్దం వరకు అరబ్బులు తెగలుగానే వున్నారు. సమిష్టిగా జీవించేవారు. అయినా ఆచారాల వల్ల వారిమధ్య అనేక విభేదాలు తలెత్తాయి. అంతేగాక అరబ్‌లలో కులీనులకు, సామాన్యులకు మధ్య కూడా తీవ్రమైన అంతరాలుండేవి. అసంతృప్తి చెందిన సామాన్య ప్రజలను తమతో వుంచుకోవడానికి, వ్యాపారాలు పెంచుకోవడానికి వారిని విదేశీ దండయాత్రల వైపు మరల్చాలని ప్రభువర్గాలు పథకం వేశాయి. అప్పుడే బైజాంటైన్ దాడివల్ల వారి వాణిజ్యమార్గాలు దెబ్బతిన్నాయి. అలాటి స్థితిలోనే **మక్కా వాసి అయిన మహ్మద్ ప్రవక్త ఇస్లాం మతాన్ని స్థాపించాడు. అల్లా పట్ల, ఖురాన్ పట్ల తిరుగులేని విధేయత వుండాలన్నాడు.** విధేయులు కానివారిపై అంటే ఇతర మతాలవారిపై యుద్ధానికి పిలుపిచ్చాడు. అలాటి యుద్ధంలో చనిపోయిన వారు నేరుగా స్వర్గానికి పోతారని చెప్పారు.

మహ్మద్ మరణానంతరం మహ్మదీయులు మొత్తం అరేబియాను స్వాధీనపరుచు కున్నారు. వారి రాజు ఖలీఫా. మొదట ఖలీఫాల నాయకత్వంలో అరబ్బులు గుర్రాలు, ఒంటెలపై మహా వెల్లువగా విరుచుకుపడ్డారు. సిరియా, ఈజిప్టు, ఇరాన్‌లు ఆక్రమించారు. 8వ శతాబ్దంలో అరబ్బులు ఉత్తర ఆఫ్రికాను జయించారు. 711లో జిబ్రాల్టర్ జలసంధి దాటి స్పెయిన్ స్వాధీనపర్చుకున్నారు. అయితే 732లో ఫ్రాంకుల చేతిలో ఓడిపోయి, వెనక్కు మళ్ళారు. తూర్పున మధ్య ఆసియా ప్రాంతం ఆక్రమించి, నైరుతి ఇండియా వరకు వెళ్ళారు. ఆవిధంగా **దమాస్కస్ రాజధానిగా 7-8శతాబ్దాలలో సువిశాలమైన అరబ్ సామ్రాజ్యం అవతరించింది. కళాసాహిత్యాలు బాగా అభివృద్ధి చెందాయి.** అయితే ఈ దండయాత్రల వల్ల అరబ్‌లలో అసమానతలు పెరిగాయి. లభించిన సంపదలు ఖలీఫాకు, ప్రభువర్గీయులకు మాత్రమే దక్కాయి. వారే భూస్వాములు అయ్యారు. రైతులు వారి మీద ఆధారపడి బ్రతకాల్సి వచ్చింది. యుద్ధాల ద్వారా దొరికిన బానిసలను కూడా ఖలీఫా విస్తృతంగా ఉపయోగించుకున్నారు. రైతులు మాత్రం ఎప్పటిలాగే పన్నుల భారం మోయాల్సి వచ్చింది. ఫలితంగా అసంతృప్తి కూడా పెరిగింది. మరోవంక తమ స్థానం బలపరుచుకున్న ప్రభువులు, కులీనులు ఖలీఫాకు విధేయంగా వుండటానికి నిరాకరించారు. 7వ శతాబ్దినాటికి ఖలీఫా సామ్రాజ్యం అనేక భాగాలుగా చీలిపోయింది. మొదట బాగ్దాద్, తర్వాత దాని నుంచి ఈజిప్టు మధ్యఆసియా, ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్ విడిపోయాయి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Veyyella+Charitra**

* * *